క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.55,074 విరాళం



ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు చెక్కును అందిస్తున్న దాత వెంకటరమణ

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని వీరవల్లిపాలేనికి చెందిన జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అడపా వెంకటరమణ కుటుంబ సభ్యులు బుధవారం రూ.55,074 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ పాలకవర్గ సభ్యులకు అందజేశారు. దాతను వేదపండితులు సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కిక్కిరిసిన సత్తెమ్మ ఆలయం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో వెలసిన సత్తెమ్మ తల్లి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. నియోజకవర్గ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అన్నసమారాధనలు జరిగాయి. నాయకులు బోనం సాయిరామ్, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, మేడిచర్ల రాము, ఇంటిపల్లి ఆనందరావు, గుబ్బల వీవీ సత్యనారాయణ, గుబ్బల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో నడుపుతున్న సామర్లకోట రూట్ ప్రయాణికులకు ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్ విజేతలకు బుధవారం రావులపాలెం బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో డ్రా తీసి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎస్.అనిత తాపేశ్వరం, రెండో బహుమతి కె.గుణసుందరి కొంకుదురు ప్రయాణికులు ఎంపికైనట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు.

23న కిసాన్ మోర్చా అధ్యక్షుడి పర్యటన

మలికిపురం: మండలంలోని సముద్రతీర ప్రాంతంలో శంకరగుప్తం ఉప్పుటేరు వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలించేందుకు ఈ నెల 23న బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగలి శశిభూషణ్‌రెడ్డి వస్తున్నారని బీజేపీ జిల్లా నాయకుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కేశనపల్లిలో పార్టీ నాయకులు అడబాల రాంబాబు ఇంటి వద్ద జరిగిన పర్యటన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పనులను అడ్డుకున్న మత్స్యకారులు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదిలో ఏర్పాటు చేసుకున్న వలకట్లను రైల్వే బ్రిడ్జి నిర్మాణం పేరుతో ధ్వంసం చేస్తున్నారంటూ మత్స్యకారులు బుధవారం నిరసన చేపట్టారు. రూ.ఆరు లక్షలతో గోదావరి నదిలో వలకట్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. వీటిపై ఆధారపడి సుమారు 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. పడవలపై రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టిన ప్రాంతానికి చేరుకుని నిరసన తెలియజేశారు. జీవనం దెబ్బతింటున్న 200 కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై గతంలోనే అధికారులకు వినతిపత్రాలు అందించినా వారు స్పందించలేదని మండిపడ్డారు. తమకు న్యాయం చేసే వరకు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనిచ్చేది లేదన్నారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం

మామిడికుదురు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల సమయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చూపిన చొరవ అభినందనీయ మని జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు ప్రశంసించారు. కాకినాడ జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. కోనసీమలో ప్రధానంగా వరదలు, భారీ వర్షాల సమయంలో ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు ప్రాంతాల్లో పరిస్థితులను అవగాహన చేసుకుని పలు సమస్యల పరిష్కారానికి తగిన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారన్నారు. అప్పనపల్లి ఉచ్చుల వారిపేట మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టర్ సీఎస్సార్ నిధులతో బ్రిడ్జి నిర్మించే విధంగా చేపట్టిన కార్యాచరణ అభినందనీయమన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద సీఆర్‌సీ ఆధ్వర్యంలో వేమన జయంతి సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన వేడుకలు ఆకట్టుకున్నాయి. వేడుకలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. చివరి రోజు సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, మరుగుజ్జుల, గరగల డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

దివ్యాంగులకు బస్సు పాసులు

అయినవిల్లి: దివ్యాంగులకు ఆర్టీసీ 50 శాతం రాయితీ పై బస్సుపాసులు అందిస్తున్నట్లు ఆర్టీసీ అమలాపురం ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్ జి.సత్యవతి తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులు ఆధార్, సదరం సర్టిఫికెట్ జెరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, రూ.100 తీసుకురావాలన్నారు. మూడేళ్ల పాటు 50 శాతం రాయితీపై రాష్ట్రం వ్యాప్తంగా ప్రయాణించవచ్చన్నారు.

అతిగా వాడితే అనర్థమే..

- ఎరువుల వినియోగంపై అవగాహన
- రైతుల్లోనూ పెరిగిన చైతన్యం



గుడిమెళ్లంకలో నారు తీస్తున్న కార్మికులు

మలికిపురం: దాళ్వా వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తుండడంతో వ్యవసాయ సిబ్బంది ఎరువుల వాడకంపై రైతులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. గతంలో ఎరువులు, పురుగుమందుల కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి నేరుగా రైతులతో మాట్లాడి ఇష్టానుసారం ఎరువులను వాడించే వారు. ఫలితంగా దిగుబడిపై ప్రభావం చూపి రైతులకు మేలు అలా ఉంచితే నష్టం అధికంగా ఉండేది. అయితే గత మూడేళ్లుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల వ్యవసాయంలో అతి ఎరువుల వినియోగం తగ్గింది. ప్రైవేటు ఎరువుల కంపెనీల సిబ్బంది సంచారం కూడా తగ్గింది. ఫలితంగా రైతులు అవసరం మేరకు ఎరువులను వినియోగిస్తున్నారు. వ్యవసాయ మండల స్థాయితో పాటు గ్రామ స్థాయి సిబ్బంది కూడా నారు మడుల స్థాయి నుంచే ఎరువుల వినియోగంపై రైతులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో రైతుల్లో కూడా రానురాను చైతన్యం పెరిగింది. వ్యాపారులు, కంపెనీల ప్రతినిధుల మాటలను వినకుండా వ్యవసాయ సిబ్బంది చెప్పిందే వేదమంటున్నారు.

పెట్టుబడితోనే మార్పు

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడితోనే ఇది సాధ్యమైంది. గతంలో వ్యవసాయ పెట్టుబడికి ఇబ్బంది పడేవారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు, ఎరువుల వ్యాపారులు వద్ద అరువుకు ఎరువులు తెచ్చేవారు. ఇటువంటి సమస్యల వల్ల వ్యాపారులు ఇచ్చిందే వాడడం వంటి ఇబ్బందులతో వ్యవసాయంలో ఇష్టానుసారం ఎరువుల వినియోగంతో పాటు అవసరం లేని, ప్రయోజనం లేని నాసిరకం ఎరువులు, పురుగుమందులను కూడా వరి సాగుకు వాడాల్సి వచ్చేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా, పెట్టుబడి నిధి అందించడంతో పాటు వ్యవసాయ రుణాలు విరివిగా ఇవ్వడం వల్ల రైతులకు ఈ బాధ తప్పింది.

బెంగాలీ నాట్లు

ప్రస్తుతం వరి నాట్లకు బెంగాలీ నాట్లు అనే పేరు నడుస్తోంది. బెంగాలీ కూలీలను తీసుకువస్తున్నారు. **కేవలం ఎకరానికి 15 నుంచి 20 కేజీల విత్తనాల నారు నాట్లే సరి పోతున్నాయి. ఆ కూలీలు కూడా కాంట్రాక్టు పద్ధతిన త్వరితగతిన నాట్లు వేస్తున్నారు. ఫలితంగా సమయం ఆదా అవుతుంది.** కూలీల కొరత వల్ల గతంలో ఇక్కడికి కృష్ణా జిల్లా నుంచి కూలీలు వచ్చేవారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాతో పాటు బెంగాలీ కూలీల హవా నడుస్తుంది. వరి నాట్ల సీజన్‌లో ఉపాధి పనుల కార్మికులను వ్యవసాయ పనులకు పంపే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేస్తున్నారు.

ఎరువులు సిద్ధం

వరి నాట్లు పూర్తవుతున నేపథ్యంలో సరిపడా ఎరువులను కూడా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మొత్తం రాజోలు వ్యవసాయ డివిజన్‌లో 150 టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికే 90 టన్నులను ఆర్డర్ పెట్టి సిద్ధం చేశారు. యూరియా, డీఏపీ, 10-26-26, 14-35-14 కాంప్లెక్స్ ఎరువులను సిద్ధంగా ఉంచారు.

వ్యవసాయ సిబ్బంది సూచనలతో



వ్యవసాయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. వారి సలహాలు, సూచనలతోనే ఎరువులు వాడుతున్నాం. ప్రభుత్వం పెట్టుబడి నిధి అందించడం వల్ల వ్యవసాయానికి అండగా ఉంటుంది. ఎరువుల కొనుగోలుకు ఇబ్బంది తప్పింది.

– నల్లి నాగేశ్వరరావు, రైతు, గుడిమెళ్లంక

అధికారులు సూచనలతోనే ఎరువులు



దాళ్వా వరి నాట్లు వేసిన రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి మాత్రమే ఎరువులు, పురుగుమందులు వాడండి. ప్రైవేటు డీలర్ల సూచనలు పాటించి ఇష్టానుసారం ఎరువులు వాడితే అనర్థాలు తలెత్తి నష్టపోతారు. మా సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటారు.

– ఎస్.రాకేష్, మండల వ్యవసాయాధికారి, మలికిపురం

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

మామిడికుదురు: మండలంలోని గ్రామాల్లో గురువారం నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా ప్రజలకు సేదలందిస్తామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 19వ తేదీ గురువారం మామిడికుదురు-1, పాశర్లపూడి-2, మగటపల్లి గ్రామ సచివాలయాల్లోను, 20న నగరం-2, ఆదుర్రు, గోగన్నమఠం, 21న మామిడికుదురు-2, కొమరాడ, ఈదరాడ, 23న గెద్దాడ, మొగలికుదురు, గోగన్నమఠం, 24న మాకనపాలెం, పెదపట్నంలంక-1, బి.దొడ్డవరం, ఫిబ్రవరి 7న పాశర్లపూడిలంక, పెదపట్నంలంక-2, 8న పాశర్లపూడి-1, పెదపట్నం, 9న లూటుకుర్రు, అప్పనపల్లి-2, 10న కరవాక, మగటపల్లి గ్రామాల్లో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఈ నెల 23 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు నిర్వాహకుడు మన్యం వర్ధనరావు బుధవారం తెలిపారు. సేవా కేంద్రంలో పదో తరగతి చదివిన వారికి ఎంఎస్ ఆఫీస్, టాలీ తదితర కోర్సులు నేర్పుతారన్నారు. శిక్షణ తీసుకునేవారు 22 తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అవగాహన కార్యక్రమానికి విధిగా హాజరు కావాలన్నారు. ఆసక్తి ఉన్న వారు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- బెల్లంపూడిలో గడప గడపకూ..



బెల్లంపూడిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని బెల్లంపూడిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ బండి మహాలక్ష్మి, స్థానిక నాయకులు బండి రమేష్, రాంబాబు, రమేష్, గోవిందరావు, చింతా నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో చిట్టిబాబు ప్రజలను కలుసుకున్నారు. జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. బెల్లంపూడిలో నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా మూడేళ్ల కాలంలో 20.79 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. రూ.9 కోట్లతో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. వాటర్ గ్రిడ్‌లో భాగంగా 160 గ్రామాలకు అవసరమైన ఫిల్టరైజేషన్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, సాధనాల రమేష్, బండి గోవిందరావు, నాగేశ్వరరావు, మెల్లం వెంకటేశ్వరరావు, కత్తుల విక్టర్, కొల్లు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వాటాపై సీఎంతో చర్చిస్తాం



రాజోలులో మంత్రి వేణును కలసిన కోనసీమ జేఏసీ టీం సభ్యులు

రాజోలు: కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు మంజూరు కోసం సీఎం జగన్‌తో చర్చిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజోలులో ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదలకై కోనసీమ జేఏసీ టీం సభ్యులు, మంత్రిని కలసిన తరుణంలో పై విధంగా మంత్రి వేణు హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రకటన వచ్చే వరకూ ఎటువంటి ఆందోళనలకు తావు లేకుండా వేచి చూడాలని మంత్రి సూచించారు. జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు ఆధ్వర్యాన నాయకులు కె.ప్రవీణ్, డాక్టర్ ఎం.నరసింహమూర్తి, పి.ప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీరామచంద్రమూర్తి, కె.సూరిబాబు పాల్గొన్నారు. శివకోటి పుంతలో మునలమ్మ అమ్మవారి ఆలయంలో మంత్రి వేణు గోపాలకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వెంట కూనపరెడ్డి రాంబాబు, గుబ్బల మనోహర్ పాల్గొన్నారు.

న్యాయవాది ‘పొన్నాడ’ సేవలు అభినందనీయం

రాజోలు: న్యాయవాదిగా పొన్నాడ హనుమంతరావు అందించిన సేవలు అభినందనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కొనియాడారు. బుధవారం రాజోలు గాంధీ హౌస్‌లో హనుమంతరావు సంస్మరణ సభ నిర్వహించారు. హనుమంతరావు చిత్రపటం వద్ద మంత్రి వేణు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ, హనుమంతరావు అరవై ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో సేవలందించి అనేక చట్టాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అనువదించారన్నారు. సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, పొన్నాడ సూర్యారావు, పొన్నాడ సూర్యప్రకాష్, పొన్నాడ ఎస్ఆర్‌వీవీ సూర్యారావు, పీసీసీ మెంబర్ రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, దార్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో సంక్రాంతి

అంబాజీపేట: ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల వారు కలుసుకునేందుకు సంక్రాంతి పండగ వేదికయింది. మూడు తరాలకు చెందిన 108 మంది మాచవరంలో సందడి చేశారు. మాచవరానికి చెందిన మంచాల కృష్ణమూర్తి మంగాయమ్మ దంపతుల మూడు తరాల కుటుంబీకులతో ఈ వేడుకలు కోలాహలంగా సాగాయి. ఇతర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ మంచాల వారి మూడు తరాల కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, మునుమనుమలంతా ఓచోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బంధుత్వాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కుటుంబీకులను ఓచోట చేర్చేందుకు మంచాల నాగరాజు, పెనుమరెడ్డి స్వర్ణప్రియ కృషి అభినందనీయమని బంధువులు పేర్కొన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరా



మంచినీటి పైపు లైన్ల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం డీఎస్‌పాలెంలో బుధవారం మంచినీటి పైపు లైన్ల పనులకు చిట్టిబాబు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పి.వెంకటలక్ష్మి, నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, నాగాబత్తుల యువరాజు, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, పెచ్చెట్టి రాంబాబు, అడ్డగళ్ల శ్రీను, నాగాబత్తుల చంటి, పంచాయతీ ఈఓ జి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

మామిడికుదురు/అంబాజీపేట/కొత్తపేట/ఆలమూరు/పి.గన్నవరం: ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబాజీపేటలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు దంతులూరి శ్రీనురాజు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుల్లేటికుర్రులో డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో, నందంపూడి, కె.పెదపూడిల్లో వర్ధంతి నిర్వహించారు. కొత్తపేటలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యాన పాత బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలమూరులో టీడీపీ శాఖ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించాయి. పి.గన్నవరంలోని స్థానిక మూడు రోడ్ల సెంటర్లో మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పన



ఈడీ పార్థసారథిని సత్కరిస్తున్న అర్చకుడు

కొత్తపేట: రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్టు సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఏపీ (సీడాప్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పార్థసారథి తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన ఈడీ మార్గంమధ్యలోని వాడపాలెంలో సంతోషిమాతని దర్శించుకున్నారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశం కల్పించాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఆలోచనల నుంచి పుట్టిన మానసపుత్రిక ఈ నైపుణ్య శిక్షణ కళాశాలలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 92 స్కిల్ ట్రెనింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయగా 52 కోర్సుల్లో సుమారు 50 వేల మంది యువతకు శిక్షణనివ్వగా వారిలో సుమారు 28,220 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు తెలిపారు. ముందుగా సంతోషిమాత ఆలయంలో అర్చకుడు పెద్దింటి రామం ఈడీ పార్థసారథి పేరున పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేసి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం రామం స్వగృహాన్ని సందర్శించి, రామం తనయుడు వంశీ రూపొందించిన వినూత్న ప్రయోగాలను తిలకించారు. వాటి ద్వారా సాధించిన రికార్డులను పరిశీలించి అభినందించారు.

సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం



కె.పెదపూడిలో గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

అంబాజీపేట: మహాత్మాగాంధీ విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని, నిర్మాణానికి వచ్చే నిధులు గ్రామాభివృద్ధికి ఉపయోగించాలని కె.పెదపూడి గ్రామస్తులు అన్నారు. స్థానిక సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహం శిథిలస్థితికి చేరడంతో దాని స్థానే నూతన విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సచివాలయం వద్ద ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి బుధవారం సమావేశం నిర్వహించారు. విగ్రహం వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ నుంచి రాయపురెడ్డి రంగయ్యకు నోటీసులు ఇచ్చారన్నారు. దాంతో స్థానికులంతా సచివాలయం వద్దకు చేరుకుని గత 40 ఏళ్లుగా చిన్న బడ్డీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నానని, నా జీవనాధారం లేకుండా నా కుటుంబాన్ని రోడ్డు పాలు చేయవద్దని అధికారుల వద్ద మొరపెట్టుకున్నాడు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు ఇప్పుడు ఉన్న స్థలం సరిపోతుందని కావాలనే రంగయ్య బడ్డీ తీసేయాలని కక్ష సాధిస్తున్నారన్నారు. గాంధీ విగ్రహ నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు వచ్చాయని చెబుతున్న అధికారులు వాటిని గ్రామంలో ప్రజలకు అవసరమయ్యే మంచి నీటి కుళాయిలకు, రహదారుల నిర్మాణానికి, వీధి లైట్ల ఏర్పాటుకు వినియోగించాలన్నారు. విగ్రహానికి అవసరమైన నిధులను గ్రామస్తులంతా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామంలో ఉన్న ఆక్రమణలు తొలగించిన తరువాతే గాంధీ విగ్రహం వద్ద ఉన్న బడ్డీని తొలగించాలని డిమాండ్ చేశారు. రంగయ్యకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా జిల్లా కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధిలో ఓఎన్జీసీని భాగస్వామ్యం చేస్తాం



కె.పెదపూడిలో ఆర్డీవో ముక్కంటికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

అంబాజీపేట: మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాభివృద్ధిలో ఓఎన్జీసీని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. కె.పెదపూడిలో ఓఎన్జీసీ రిగ్గు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ పంచాయతీ తీర్మానం జిల్లా కలెక్టర్‌కు అందజేయడంతో ఆర్డీఓ బుధవారం ఓఎన్జీసీ స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా బీరవారిపేట, నేదునూరి వారిపేట కాలనీలకు చెందిన మహిళలు మాట్లాడుతూ తమ నివాస ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ భవనం, పక్కా ఇళ్లు ఓఎన్జీసీ ద్వారా నిర్మించి ఇవ్వాలని ఆర్డీవోకు వివరించారు. ఓఎన్జీసీ రిగ్గు పనులు ప్రారంభించే ముందే స్పష్టమైన హామీని తమ కాలనీవాసులకు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు తెలిపిన అభివృద్ధి పనులపై త్వరలో గ్రామ సభ ఏర్పాటు చేసి తీర్మాన కాపీని జిల్లా కలెక్టర్‌కు పంపించే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటిలకు సూచించారు. కాలనీ వాసులు చెప్పిన అంశాలన్నింటిని ఉన్నతాధికారులకు తెలియపరిచి తగు న్యాయం చేస్తామని చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎల్.జోసఫ్, ఓఎన్జీసీ జీఎం జాన్ వెస్లీ, వీఆర్వోలు ఉన్నారు.

ఊపందుకున్న తీర్థం పనులు



పశ్చిమ రాజగోపురానికి చేస్తున్న విద్యుదీకరణ పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనృసింహుని తీర్థం పనులు ఊపందుకున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల అనంతరం ఆయా శాఖల ఆధ్వర్యంలో పనులు వేగవంతమయ్యాయి. ప్రధానంగా ఆలయం లోపల, వెలుపల భక్తుల క్యూలకు సంబంధించిన బారికేడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. స్వామివారి కల్యాణం వేదిక ఎదురుగా ఐరన్‌మెష్ పందిరిపై కొత్తగా తాటాకు వేసే పనులు పూర్తి చేశారు. స్వామి రథం చక్రాలకు కీలు పెట్టే పనులు పూర్తి చేశారు. ఆలయానికున్న నాలుగు దిక్కుల్లోని ప్రధాన రాజగోపురాలకు విద్యుదీకరణ పనులు చేస్తున్నారు. సంక్రాంతి పర్వదినాలు ముగిసిన కూడా ఆ రద్దీ కొనసాగుతోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అలాగే అన్నదాన పథకంలో స్వామి ప్రసాదాన్ని భక్తులు తీసుకున్నారు. బూరెలు, పులిహోరతో కలిపి వడ్డిస్తున్న రుచికరమైన భోజనాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

అంతర్వేదిపాలెంలో వైఎస్సార్ పొలంబడి

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో బుధవారం వ్యవసాయ శాఖ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించింది. పొలంబడిలో రైతులకు నాణ్యమైన, అధిక ఉత్పత్తులు సాధించే దిశగా మెళకువలు, రసాయన ఎరువుల వాడకం, పురుగుమందుల వినియోగంపై రాజోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు వివరించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్‌బీకే సెంటర్ల ద్వారా వరి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇదిలా ఉండగా మండలంలో ఇప్పటి వరకూ 1507 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్టు ఏవో పీవీ నరసింహారావు తెలిపారు. సర్పంచ్ నల్లి లీలావతి, రైతులు వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట: పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పెదగూళ్లపాలెం ఆయకట్టు రైతులకు వ్యవసాయ అధికారులు వరి సాగులో అవగాహన కల్పించారు. ఏడీఏ వెంకటరామారావు మాట్లాడుతూ రైతులు తమ పొలాన్ని తరచూ పరిశీలన చేయాలని, అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని, విచక్షణ రహితంగా మందులు వాడకుండా మిత్రపురుగులను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ సమగ్రంగా చేయాలి

అంబాజీపేట: మండలంలోని వరి పంటల వివరాలను సేకరిస్తూ ఈ క్రాప్ బుకింగ్ సమగ్రంగా చేయాలని సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. గంగలకుర్రు, ఇరుసుమండ, ముక్కామల గ్రామాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు ఈ క్రాప్ బుకింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్‌లో రైతు, కౌలు వివరాలు, పంటల నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో అగ్నిప్రమాదం



కేశవదాసుపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన ఇల్లు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు కూనపాలెంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పేరాబత్తుల సుబ్బలక్ష్మి, సత్తిబాబులకు చెందిన రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. పొయ్యి నుంచి వ్యాపించిన మంటలు రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఆస్తి నష్టం రూ.4 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న రాజోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అలాగే ఘటనపై స్థానిక యూత్ కూడా స్పందించి మంటలు అదుపులో సాయపడ్డారు. కాగా కట్టుబట్టలతో బయటపడిన తమను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.